బలగం
BALAGAM TV
BALAGAM TV DIGITAL NEWS PAPER | balagamtv100@gmail.com
హైదరాబాద్ ఆదివారం 19 అక్టోబర్ 2025 | www.balagamtv.com | పేజీలు 4

## రికార్డు స్థాయిలో కొనుగోళ్లు

- కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్

బలగం టీవీ, న్యూఢిల్లీ బ్యూరో

కొత్త జీఎస్టీ సంస్కరణలతో దేశంలో కొనుగోళ్లు పెరుగుతున్నాయని కేంద్ర ఆర్థికశాఖ మంత్రి నిర్మలా సీతారామన్ తెలిపారు. సెప్టెంబరు 22న తీసుకొచ్చిన సంస్కరణలతో వినియోగదారుల్లో కొనుగోలు శక్తి పెరిగిందన్నారు. జీఎస్టీ 2.0 ద్వారా ప్రజలు ఊహించిన దానికంటే ఎక్కువ పన్ను తగ్గింపులు చేపట్టామన్నారు. దసరా సమయంలో ప్రజలు రికార్డు స్థాయిలో చేసిన కొనుగోళ్ల ద్వారా సంస్కరణల ప్రభావం కనిపిస్తోందని చెప్పారు. కేంద్ర మంత్రులు నిర్వహించిన మీడియా సమావేశంలో ఆమె ఈ వ్యాఖ్యలు చేశారు. జీఎస్టీ సంస్కరణలపై నిర్వహించిన కార్యక్రమంలో కేంద్ర మంత్రులు పీయూష్ గోయల్, అశ్వినీ వైష్ణవ్ పాల్గొన్నారు.ఈ సంస్కరణలు దేశ ప్రజలకు ప్రధాని మోడీ ఇచ్చిన దీపావళి కానుక అని పీయూష్ గోయల్ తెలిపారు. కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్ మాట్లాడుతూ.. జీఎస్టీ సంస్కరణ సమయంలో దేశంలో వినియోగం, డిమాండ్ ఎలా పెరుగుతుందనే దాని గురించి అనేక అంచనాలు రూపొందించినట్టు తెలిపారు. ఈ ఏడాది దాదాపు రూ.20 లక్షల కోట్ల అదనపు వినియోగం జరిగే అవకాశం ఉందని అన్నారు. స్మార్ట్‌ఫోన్లు తయారు చేసే పలు అతిపెద్ద కంపెనీలు వాటి తయారీలో దాదాపు 20 శాతాన్ని భారత్‌లోనే చేపడుతున్నాయని పేర్కొన్నారు.

# బీసీల ధూం‌దాం



- రాష్ట్ర బంద్ ఒక శాంపిల్ మాత్రమే
- ముందు ముందు బీసీల తడాఖా ఏందో చూపిస్తాం
- బీసీ బంద్ తోనైనా కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు కళ్ళు తెరవాలి
- బీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్
- బీజేపీ తెలంగాణ నేతలు ప్రధాని వద్దకు తీసుకెళ్తామంటే సీఎం అఖిలపక్షంతో రావడానికి సిద్ధం
- టీపీసీ చీఫ్ మహేష్ గౌడ్

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాజ్యాంగ సవరణ ద్వారా బీసీలకు బీసీల రిజర్వేషన్లకు రాజ్యాంగబద్ధత కల్పించాలని, రాష్ట్ర ప్రభుత్వం పెంచిన బీసీ రిజర్వేషన్లను యధావిధిగా అమలు చేయాలని ప్రధాన డిమాండ్‌తో బీసీ జేఏసీ ఇచ్చిన పిలుపుమేరకు రాష్ట్ర వ్యాప్తంగా పల్లె నుండి పట్టణ వరకు సకలం బంద్ జరిగింది. రాష్ట్ర బంద్‌లో భాగంగా బీసీ సంక్షేమ సంఘం ఆధ్వర్యంలో తెల్లవారుజామున నాలుగు గంటల నుండి హైదరాబాద్‌లోని ఎంజీబీఎస్ బస్ స్టేషన్ వద్ద వందల మంది బీసీ శ్రేణులతోబీసీ సంక్షేమ సంఘం జాతీయ అధ్యక్షులు జాజుల శ్రీనివాస్ గౌడ్ ఆర్టీసీ బస్సులను బయటకు కదలకుండా ఆందోళన నిర్వహించారు ఆందోళన సందర్భంగా గంగిరెద్దుల విన్యాసాలు, బీసీ కళాకారుల ఉద్యమ గీతాలతో ఆటపాటలతో ధూమ్ దాం ను నిర్వహించారు దీనితో బస్ స్టేషన్ పరిసర ప్రాంతాలు కళాకారుల ఆటపాటలతో బీసీ ఉద్యమకారుల నినాదాలతో దద్దరిల్లిపోయింది

మొదటగా జాజుల శ్రీనివాస్ గౌడ్ మాట్లాడుతూ తాము అనుకున్న దాని కంటే రాష్ట్ర బంద్ చారిత్రాత్మకంగా విజయవంతం జరిగిందని ఈ బంద్ ద్వారనైనా బీసీ రిజర్వేషన్ల కు రాజ్యాంగ రక్షణ కల్పించడానికి కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు చొరవ చూపాలని డిమాండ్ చేశారు ఈ బంద్ రాష్ట్రంలో శాంపిల్ మాత్రమేనని ముందు ముందు బీసీ ఉద్యమాన్ని రగిలిస్తామని హెచ్చరించారు తక్షణమే సీఎం రేవంత్ రెడ్డి అఖిలపక్షంతో ఢిల్లీకి వెళ్లి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి పెంచాలని, అవసరమైతే బీసీ రిజర్వేషన్లు ఆమోదించే వరకు ప్రధాని, రాష్ట్రపతి భవన్‌లో వద్ద సీఎం ధర్నా చేపట్టాలని తెలిపారు. అన్ని రాజకీయ పార్టీలు, సామాజిక ఉద్యమ శక్తులు సహకారంతో ఈరోజు రాష్ట్ర బంద్ దిగ్విజయం జరిగిందని ఇదే స్ఫూర్తితో భవిష్యత్తులో జేఏసీలో చర్చించి బీసీ రథయాత్రను అన్ని జిల్లాల్లో చేపట్టి హైదరాబాదులోని గ్రౌండ్ లో లక్షల మందితో బహిరంగ సభ నిర్వహిస్తామని, ఢిల్లీ పై ఒత్తిడి పెంచడానికి ప్రత్యేక రైళ్ల ద్వారా ఢిల్లీకి వెళ్లి ఆందోళన కార్యక్రమాలు నిర్వహిస్తామని ఆయన తెలిపారు రాష్ట్ర బంద్ తోనైనా కేంద్ర ప్రభుత్వం ఇకనైనా తొమ్మిదవ షెడ్యూల్లో రిజర్వేషన్లను చేర్చి బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ రక్షణ కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు

పిసిసి అధ్యక్షులు బొమ్మ మహేష్ కుమార్ గౌడ్ మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్ల విషయంలో కాంగ్రెస్ ప్రభుత్వ చిత్తశుద్ధిని ఎవరు శంకించాల్సిన అవసరం లేదని స్థానిక సంస్థల ఎన్నికల ను ఆపి బీసీ రిజర్వేషన్లు పెంచాలని గత 23 నెలలుగా ప్రయత్నిస్తున్నామని గత సుప్రీంకోర్టు తీర్పులు గత ప్రభుత్వం చేసిన చట్టమూలంగా బీసీ రిజర్వేషన్ల కు మోక్షం లభించడం లేదని ఆయన అన్నారు బీసీ రిజర్వేషన్ల విషయంలో ఒక పార్టీపై ఇంకొక పార్టీ నెపం నెట్టు కోవడం సరికాదని బీసీ రిజర్వేషన్ల పెంచడం వలన కాంగ్రెస్ పార్టీకి మైలేజీ వస్తుందని బిజెపి అనుకుంటే బిజెపి పార్టీ నే చొరవ తీసుకొని ఆ పార్టీ అధ్యక్షులు రామచంద్రరావు ప్రధాని సమయం తీసుకుంటే సీఎం అఖిలపక్షంతో ఢిల్లీకి రావడానికి సిద్ధంగా ఉన్నారని ఆయన అన్నారు బీసీ రిజర్వేషన్లను చట్టబద్ధంగా 42 శాతం పెంచిన తర్వాతనే స్థానిక సంస్థల ఎన్నికల నిర్వహించాలని కాంగ్రెస్ పార్టీ తరఫున రాష్ట్ర ప్రభుత్వానికి సూచించామని ఎంత త్వరగా వీలైతే అంత త్వరగా బీసీ రిజర్వేషన్ల కు కేంద్రం చట్టబద్ధత కల్పించేలా చర్యలు తీసుకోవాలని మహేష్ గౌడ్ కోరారు

ఎమ్మార్పీఎస్ వ్యవస్థాపక అధ్యక్షులు పద్మశ్రీ మందకష్ణ మాదిగ మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లు పెంచడానికి రేవంత్ రెడ్డి ప్రభుత్వం ఇప్పటివరకు చిత్తశుద్ధితో వ్యవహరించినప్పటికీ, కేంద్ర ప్రభుత్వంపై ఇంకా ఒత్తిడి పెంచాల్సి నా బాధ్యత రాష్ట్ర ప్రభుత్వాన్ని దేననీ , బీసీ రిజర్వేషన్ల బాధ్యతను కాంగ్రెస్ ప్రభుత్వం తమ భుజాల మీద వేసుకొని బీసీ రిజర్వేషన్లు సాధించగలిగితే ఆ క్రెడిట్ రేవంత్ రెడ్డికి దక్కుతుందని ఆయన అన్నారు తెలంగాణలోని బిజెపి పెద్దలు బీసీ రిజర్వేషన్ల విషయంపై ఢిల్లీ పెద్దలతో చర్చించి సానుకూల నిర్ణయం వచ్చేలా చర్యలు తీసుకోవాలని ఆయన కోరారు అగ్రవర్ణాలకు ఏడబ్ల్యూస్ ద్వారా రిజర్వేషన్లు పెంచినప్పుడు కానరాని 50% పరిమితి బీసీ రిజర్వేషన్ పెంచినప్పుడే కనపడడం చాలా ఆక్షేపనియమన్నారు బీసీ ఉద్యమానికి మద్దతుగా ఎమ్మార్పీఎస్ అండగా నిలబడుతుందని మందకష్ణ తెలిపారు

సిపిఐ ఎమ్మెల్సీ నెలికంటి సత్యం మాట్లాడుతూ బీసీ రిజర్వేషన్లపై ప్రభుత్వాలు నిర్లక్ష్యం చేస్తే బీసీలు తిరగబడడం ఖాయమన్నారు ఇప్పటికైనా బీసీల్లో అగ్రహ జ్వాలలు రగలకముందే కేంద్ర ప్రభుత్వం బీసీ రిజర్వేషన్లకు రాజ్యాంగ రక్షణ కల్పించాలని లేకపోతే బీసీలతో భారత కమ్యూనిస్టు పార్టీ ఉద్యమిస్తుందని ఆయన హెచ్చరించారు ఈ ఆందోళన కార్యక్రమం లో మైనింగ్ కార్పొరేషన్ చైర్మన్ ఇరావత్ అనిల్, బీసీ జేఏసీ కో చైర్మన్ రాజారాం యాదవ్, లంబాడ సేవాలాల్ సేన రాష్ట్ర అధ్యక్షుడు సంజీవ్ నాయక్, కాంగ్రెస్ మహిళా నేత ఇందిరా శోభన్,బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కుల్కచర్ల శ్రీనివాస్ ముదిరాజ్, బీసీ జేఏసీ కో చైర్మన్ రాజారాం యాదవ్, బిసి విద్యార్థి సంఘం జాతీయ అధ్యక్షులు తాటికొండ విక్రమ్ గౌడ్, బీసీ యువజన సంఘం జాతీయ అధ్యక్షులు కనకాల శ్యాంకుర్మా, , బీసీ మహిళా సంఘం అధ్యక్షురాలు బర్ల మణిమంజరి సాగర్, బిసి విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షులు గొడుగు మహేష్ యాదవ్, బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర కార్యదర్శి జాజుల లింగం గౌడ్, బిసి యువజన సంఘం జాతీయ ఉపాధ్యక్షులు రావులకోల్ నరేష్ ప్రజాపతి, పానుగంటి విజయ్ గౌడ్, వరికుప్పల మధు, మాదేశి రాజేందర్, నరసింహ నాయక్, జగన్నాథం, మహిళా సంఘం నాయకురాలు తారకేశ్వరి సమత యాదవ్, శ్యామల, స్వర్ణ గౌడ్, గౌతమి, సంధ్యారాణి, విజయలక్ష్మి,గూడూరు భాస్కర్, జిల్లెల నరసింహ, వెంకటేష్ గౌడ్, ఇంద్రమ్ రజక, సత్యం గౌడ్, భారత్ గౌడ్, గుంటి మహేష్, నాగరాజ్ , మీనాదేవి, రాజేశ్వరి తదితరులు పాల్గొన్నారు..ఆందోళన అనంతరం ఎంజీబీఎస్ బస్ స్టేషన్ నుండి అసెంబ్లీ వరకు బారీ బైక్ ర్యాలీ నిర్వహించారు

## తెలంగాణ రైజింగ్ 2047లో భాగస్వాములు కండి



- తల్లిదండ్రులను పట్టించుకోకుంటే జీతంలో కోత
- గత ప్రభుత్వం నిరుద్యోగులను నిండా ముంచింది
- మేము మొదటి ఏడాదిలోనే 60 వేల ఉద్యోగాలిచ్చాం
- గూప్-2 విజేతలకు ఉద్యోగ నియామక పత్రాల అందజేత కార్యక్రమంలో సీఎం రేవంత్‌రెడ్డి

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

దేశానికి స్వాతంత్ర్యం సిద్ధించి వందేళ్ల నాటికి తెలంగాణను 3 ట్రిలియన్ డాలర్ల బలీయమైన ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దాల్సిన గురుతరమైన బాధ్యత గ్రూప్–2 లో ఎంపికైన అభ్యర్థులందరిపైనా ఉందని, అందుకోసం శక్తివంచన లేకుండా కృషి చేయాలని ముఖ్యమంత్రి శ్రీ రేవంత్ రెడ్డి పిలుపునిచ్చారు.

శిల్పకళా వేదికలో ఏర్పాటు చేసిన "ప్రజాపాలనలో కొలువుల పండుగ" కార్యక్రమంలో భాగంగా గ్రూప్ %–%2 సర్వీసులకు ఎంపికైన 783 మంది అభ్యర్థులకు ముఖ్యమంత్రి గారి చేతుల మీదుగా లాంఛనంగా నియామక పత్రాల అందజేశారు. ఈ కార్యక్రమంలో ఉప ముఖ్యమంత్రి మల్లు భట్టి విక్రమార్క గారు, మంత్రి పొన్నం ప్రభాకర్ గారితో పాటు సలహాదారులు, ప్రజా ప్రతినిధులు, ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి గారు హాజరయ్యారు.దీపావళి పండుగ శుభవేళ ఉద్యోగ నియామక పత్రాలను అందుకుంటున్న అభ్యర్థులు, వారి తల్లిదండ్రులకు ఈ సందర్భంగా ముఖ్యమంత్రి గారు అభినందనలు తెలియజేశారు. తెలంగాణ బలమైన ఆర్థిక శక్తిగా తీర్చిదిద్దాలని తెలంగాణ రైజింగ్ - 2047 లక్ష్యాలను నిర్దేశించామని ముఖ్యమంత్రి గారు గుర్తుచేస్తూ, గ్రూప్–2 లో ఎంపికైన వారంతా తెలంగాణ పునర్నిర్మాణంలో భాగస్వాములు కావాలన్నారు.

మనిషి జీవితంలో జన్మదినం ఎంత ముఖ్యం, ఉద్యోగానికి సంబంధించిన నియామక పత్రం అందుకోవడం కూడా అంతే ముఖ్యమైన రోజు. ఈరోజు అందుకోబోయే నియామక పత్రం జీవితంలో ఒక భావోద్వేగం. ఈరోజు నుంచి మీరంతా బాధ్యత కలిగిన అధికారులు. ఎల్లప్పుడు అప్రమత్తంగా వ్యవహరించండి. 4 కోట్ల తెలంగాణ ప్రజల భవిష్యత్తును భద్రంగా కాపాడుకుంటూ ముందుకు సాగాలి.ప్రభుత్వ అధికారులుగా ఉద్యోగంలో చేరడానికి తమ రక్తాన్ని చమటగా మార్చి మిమ్మల్ని భూజాన మోసిన తల్లిదండ్రులను మరిచిపోవద్దు. కన్న తల్లిదండ్రులను, పుట్టి పెరిగిన ఊరిని అభివృద్ధి చేసుకోవడం మీ బాధ్యత.

ఈరోజు నుంచి అధికారులుగా మీవద్దకు వచ్చే ఏ పేదవాడిలోనైనా తల్లిదండ్రులను గుర్తు తెచ్చుకుని సేవలు అందించాలి. నిస్సహాయులకు అండగా సహాయం అందించడమే బాధ్యతగా విధులు నిర్వర్తించాలి. ఎవరైనా తల్లిదండ్రులను విస్మరిస్తే వారి జీతం నుంచి 10 శాతం కోత పెట్టి తల్లిదండ్రుల ఖాతాల్లో వేసేట్టుగా చట్టం చేయబోతున్నాం.ముందుగానే గ్రూప్–2 ఫలితాలు వెల్లడించినట్టయితే ఎంపికైన అభ్యర్థులు తిరిగి గ్రూప్–1 లో కూడా సెలెక్షన్ వస్తే అందులోకి వెళ్లినప్పుడు గ్రూప్–2 ఖాళీల్లో కొందరు అభ్యర్థులు అవకాశాలు కోల్పోతారని భావించి ముందుగా గ్రూప్–1 ఫలితాలు విడుదల చేశారు. అదే క్రమంలో గ్రూప్ –3 ఆ తర్వాత గ్రూప్–4 ఫలితాలను కూడా వెల్లడిస్తారు.ప్రజా ప్రభుత్వం అధికారం చేపట్టిన తర్వాత మొదటి సంవత్సరంలోనే 60 వేల ఉద్యోగాలను భర్తీ చేశాం. అలాగే, సుదీర్ఘ కాలంగా పెండింగ్‌లో ఉన్న ఎస్సీ వర్గీకరణకు శాశ్వత పరిష్కారం చూపించాం. దేశంలో ఎక్కడా లేని విధంగా కుల గణన పూర్తి చేశాం" అని ముఖ్యమంత్రి గారు అన్నారు. రాష్ట్ర అభివృద్ధి కోసం సమర్థవంతంగా పనిచేయాలని ఉద్బోధించారు.

## ఆఫ్ఘనిస్తాన్‌పై పాక్ దాడులు

- ముగ్గురు క్రికెటర్ల మృతి

బలగం టీవీ, కాబూల్



ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్ దేశాల మధ్య ఉద్రిక్త పరిస్థితులు చల్లారటం లేవు. సరిహద్దు సమీపంలోని పక్టికా రాష్ట్రంలో పాకిస్తాన్ దళాలు జరిపిన వైమానిక దాడిలో ముగ్గురు ఆఫ్ఘనిస్తాన్ క్రికెటర్లు ప్రాణాలు కోల్పోయారు. స్నేహపూర్వక మ్యాచ్ ఆడేందుకు ఉర్గన్ నుంచి తూర్పు పక్టికా రాష్ట్రంలోని షరానాకు వెళుతుండగా ఈ దాడి జరిగిందని ఆఫ్ఘనిస్తాన్ క్రికెట్ బోర్డు (ఏసీబీ) తెలిపింది. పాక్ దాడిలో మరణించిన క్రికెటర్లను కబీర్, సిబ్ఘతుల్లా, హరూన్‌గా గుర్తించారు. ఈ దాడిలో మరో ఐదుగురు కూడా చనిపోయారు. ఇది పిరికిపంద చర్య అని ఏసీబీ ఆగ్రహం వ్యక్తం చేసింది. కాగా దాడి నేపథ్యంలో వచ్చే నెలలో పాకిస్తాన్, శ్రీలంక దేశాలతో జరగాల్సిన మూడు దేశాల క్రికెట్ సిరీస్ నుంచి ఆఫ్ఘనిస్తాన్ వైదొలిగింది. పాక్ దాడిని అఫ్ఘన్ టీ–20 జట్టు కెప్టెన్ రషీద్ ఖాన్, అంతర్జాతీయ క్రీడాకారులు మహమ్మద్ నబీ, ఫజల్‌హక్ ఫరూఖీ తీవ్రంగా ఖండించారు. ఇదిలావుండగా ఆఫ్ఘనిస్తాన్, పాకిస్తాన్ ప్రతినిధులు శనివారం దోహాలో శాంతి చర్చలు ప్రారంభించారు. అయితే పాకిస్తాన్ రక్షణ మంత్రి ఖవాజా అసిఫ్ కీలక వ్యాఖ్యలు చేశారు. భారత్‌కు ఆఫ్ఘనిస్తాన్ ప్రతినిధిగా వ్యవహరిస్తోందని ఆరోపించారు. భారత్‌తో కలిసి పాకిస్తాన్‌పై కుట్ర పన్నుతోందని నిందించారు. పాకిస్తాన్‌లో నివసిస్తున్న ఆఫ్ఘన్లు అందరూ తమ స్వదేశానికి వెళ్లిపోవాలని హెచ్చరించారు. కాబూల్‌తో దౌత్య సంబంధాలు తెగిపోయాయని ఆయన ప్రకటించారు. మరోవైపు పాకిస్తాన్ కాల్పుల విరమణ ఒప్పందాన్ని ఉల్లంఘిస్తోందని, తమ దేశంలో వైమానిక దాడులు జరిపిందని, ఈ దాడుల్లో కనీసం పది మంది చనిపోయారని ఆఫ్ఘనిస్తాన్ అధికారులు తెలిపారు.

## కాంగ్రెస్ పాలన దండుపాళ్యం ముఠా లెక్క ఉంది..



- ప్రజలకు మొండిచేయి, ఆరు గ్యారెంటీలకు దిక్కులేదు
- కేంద్రం వెంటనే విచారణ జరిపించాలి
- మాజీ మంత్రి హరీష్ రావు

బలగం టీవీ, హైదరాబాద్

తెలంగాణ భవన్‌లో నిర్వహించిన మీడియా సమావేశంలో మాజీ మంత్రి హరీష్ రావు కాంగ్రెస్ ప్రభుత్వంపై తీవ్ర స్థాయిలో విమర్శలు గుప్పించారు. మొన్నటి క్యాబినెట్ మీటింగ్ ప్రజల సమస్యల గురించి కాకుండా మంత్రుల 'పంచాయతీల' కోసమే జరిగిందని ఆయన ఆరోపించారు. క్యాబినెట్ మీటింగ్‌లో దసరా, దీపావళి కానుకలుగా ప్రజలకు తీపి కబురు చెబుతారని, రైతులకు రూ. 1300 కోట్ల బోనస్ బకాయిలు, మహిళలకు 'మహాలక్ష్మి' కింద రూ. 2500, లేదా పెంచిన పింఛన్లు ప్రకటిస్తారని ఆశించిన ప్రజలకు తీవ్ర నిరాశే మిగిలిందని హరీష్ రావు అన్నారు.

"క్యాబినెట్ లో ఉన్న మంత్రులు అరడజను వర్గాలుగా చీలిపోయారు. ఒకరంటే ఒకరికి పడటం లేదు. సీఎం, మంత్రులు పాలన గాలికి వదిలి పర్సనల్ పంచాయతీలు పెట్టుకుంటున్నారు. కమీషన్ల కోసం ఒకరు, కాంట్రాక్టుల కోసం ఒకరు, వాటాల కోసం ఒకరు కొట్లాడుతున్నారు. ఇది మంత్రుల కేబినెట్ లెక్క లేదు.. దండుపాళ్యం ముఠా లెక్క ఉంది. అంతకంటే అధ్వాన్నం" అని హరీష్ రావు మండిపడ్డారు. 'దీపం ఉండంగానే ఇల్లు చక్కబెట్టుకోవాలనే' ఉద్దేశ్యంతో అధికారంలో ఉన్నప్పుడే అందినకాడికి దండుకోవాలని చూస్తున్నారని విమర్శించారు. కేసీఆర్ ఉద్యోగాల్లో 95శాతం లోకల్ రిజర్వేషన్ సాధించారని నీళ్లలో వాటా కోసం కొట్లాడారు. నిధుల వాటా కోసం కొట్లాడారని అన్నారు. నేడు కమీషన్ల కోసం, కాంట్రాక్టుల కోసం, అక్రమ వసూళ్లలో వాటా కోసం మంత్రులు కొట్లాడుతున్నరని, కాంట్రాక్టుల కోసం డిపార్టుమెంట్లే రద్దు చేస్తున్నారని తెలిపారు.

బిఆర్ఎస్ ప్రభుత్వం టీఎస్ఐపాస్ ద్వారా పెట్టుబడులకు రెడ్ కార్పెట్ వేస్తే, రేవంత్ రెడ్డి హయాంలో 'గన్ కల్చర్' వచ్చిందని ఆరోపించారు. పారిశ్రామికవేత్తలు, రియల్ ఎస్టేట్ వ్యాపారులు, కాంట్రాక్టర్లను బెదిరిస్తున్నారని, అక్రమ వసూళ్లకు పాల్పడుతున్నారని తెలిపారు. టీఎస్ఐపాస్ ఏర్పడ్డాక అతి తక్కువ పెట్టుబడులు (2024–25లో కేవలం 2049 పరిశ్రమలు, రూ. 50 వేల కోట్లు) రేవంత్ రెడ్డి కాలంలోనే వచ్చాయని చెప్పారు. ముఖ్యమంత్రి సన్నిహితులే తుపాకీ పట్టి బెదిరించారని ఒక మంత్రి కుమార్తెనే స్పష్టంగా చెప్పడం రాష్ట్రంలో అరాచక పాలనకు నిదర్శనం అన్నారు.

ముఖ్యమంత్రి జపాన్ నుంచి ఫైల్ ఆపించారు, ఇంకో మంత్రి టెండర్లు మాకు దక్కవద్దని హుకుం జారి చేసారు అని, రాష్ట్రంలో అరాచకం రాజ్యమేలుతున్నదని, ఇంత జరుగుతున్నా బీజేపీ మౌనంగా ఉండటంపై హరీష్ రావు ప్రశ్నించారు. ముఖ్యమంత్రే తుపాకీ పంపారు అంటే ఎందుకు విచారణ జరపరని, ఇది కాంగ్రెస్–బీజేపీ 'జాయింట్ వెంచర్' ప్రభుత్వం కాకపోతే, కేంద్ర మంత్రి కిషన్ రెడ్డి, సంజయ్ స్పందించి కేంద్ర ప్రభుత్వ సంస్థలతో లేదా ఇండిపెండెంట్ జుడిషియల్ కమిషన్ పెట్టి విచారణ జరిపించాలని డిమాండ్ చేశారు. లేదంటే వారి మధ్య 'అక్రమ సంబంధం' ఉన్నట్లే భావించాల్సి వస్తుందని అన్నారు.డిసెంబర్ 1 నుంచి 9 వరకు విజయోత్సవాలు చేసుకోవడానికి కాంగ్రెస్ ప్రభుత్వానికి ఏం అర్హత ఉందని ప్రశ్నించారు. "రెండు సీజన్ల రైతు భరోసా ఎగ్గొట్టినందుకా?" "రుణమాఫీ సరిగ్గా చేయనందుకా?" "నిరుద్యోగ భృతి ఇవ్వనందుకా?" "మహాలక్ష్మి పథకం, పింఛన్లు పెంచనందుకా?" "హైడ్రా పేరిట పేదల ఇళ్లు కూల్చినందుకా?" "23 నెలల పాలనలో ఒక్క ఇల్లు కట్టింది లేదు, ఒక్క అద్భుతం చేసింది లేదని", టిమ్స్ ఆసుపత్రులు పూర్తి చేసింది లేదని, ఉన్న పథకాలను ఊడగొట్టారని ఫీజు రియింబర్స్ మెంట్ ఇవ్వలేదని జరపుతారా? కేసీఆర్ కిట్ బంద్ చేసారని జరుపుతారా, గొర్రెల స్కీం బంద్ పెట్టినమని జరుపుతారా? కట్టిన ఇల్లు పెట్టిన పొయ్యిలా అద్భుతమైన రాష్ట్రాన్ని మీ చేతిలో పెడితే ఆగం చేసారు. ఆరు గ్యారెంటీలకు దిక్కు లేదు, 420 హామీల అమలు ఊసు లేదు, అసలు ఏం చేసావని విజయోత్సవాలు%% రెండు సీజన్ల రైతు భరోసా ఎగ్గొట్టినందుకా? కౌలు రైతులకు రైతు భరోసా ఇవ్వనందుకా? రైతు కూలీలందరికి ఆత్మీయ భరోసా అని ఇవ్వకుండా మోసం చేసినందుకా? రుణమాఫీ చారణ చేసి బారాణ మందిని మోసం చేసినందుకా? అన్ని పంటలకు బోనస్ అని, సన్నాలకే పరిమితం చేసినందుకా? 1300 కోట్ల బోనస్ డబ్బులు ఇప్పటికీ రైతులకు చెల్లించినందుకా? దేశానికి అన్నం పెట్టే రైతన్నలపై అక్రమ కేసులు బనాయించి అరెస్టులు చేసినందుకా? లగచర్ల, రాజోలి రైతుల చేతుల చేతులకు బీడీలు వేసినందుకా? మొద టి ఏడాదిలోనే 2 లక్షల ప్రభుత్వ ఉద్యోగాలు అని యువతను మోసం చేసినందుకా? నిరుద్యోగ భృతి ఎగ్గొడుతున్నందుకా? మహాలక్ష్మి పేరిట నెలకు 2500 ఇస్తానని, ఇప్పటికీ అమలు చేయనందుకా? ఆడబిడ్డలకు తులం బంగారం ఇవ్వనందుకా? అవ్వాతాతలకు పింఛన్లు పెంచనందుకా? హైడ్రా పేరిట పేదల ఇండ్లు కూల్చినందుకా? మూసీ సుందరీకరణ పేరుతో కమీషన్లు దండుకుంటున్నందుకా? ఎందుకు విజయోత్స వాలు చేస్తా అంటున్నవు రేవంత్ రెడ్డి? ఇంకెంత కాలం మోసం చేస్తారు, ఇంకెంత కాలం మభ్యపెడుతరు. 22 నెలల కాలంలో అన్ని వర్గాల ప్రజలను అరిగోస పెట్టినవు, ఎందుకోసం ఉత్సవాలు జరుపుతావు. విమర్శించారు. ఆరు గ్యారెంటీలకు దిక్కు లేదని, 420 హామీల అమలు ఊసే లేదని ఎద్దేవా చేశారు.కొత్తగా తీసుకొచ్చిన 'హ్యామ్ మోడల్' కమీషన్లు దండుకోవడానికే లక్ష్యమని ఆరోపించారు.

## రెండు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలు మంజూరు

- ఉత్తర్వులు విడుదల

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

రాష్ట్రంలో రెండు ప్రభుత్వ డిగ్రీ కాలేజీలను రాష్ట్ర ప్రభుత్వం మంజూరు చేసింది. ఈ మేరకు విద్యాశాఖ కార్యదర్శి యోగితారాణా శనివారం ఉత్తర్వులు విడుదల చేశారు. కరీంనగర్ జిల్లా చొప్పదండి నియోజకవర్గంలో గంగాధర మండలంలో ప్రభుత్వ డిగ్రీ కాలేజీని మంజూరు చేశామని తెలిపారు. జగిత్యాల జిల్లా ధర్మపురి నియోజకవర్గ కేంద్రంలో మరో ప్రభుత్వ డిగ్రీ కాలేజీని మంజూరు చేశామని వివరించారు. ఆ రెండు కాలేజీల్లో వచ్చే విద్యాసంవత్సరం (2026–27) నుంచి తరగతులు ప్రారంభమయ్యే అవకాశమున్నది. రాష్ట్రంలో 119 ప్రభుత్వ, 35 ప్రభుత్వ అటానమస్ కలిపి మొత్తం 154 ప్రభుత్వ డిగ్రీ కాలేజీలున్నాయి. నారాయణపేట జిల్లా ధన్వాడ మండల కేంద్రంలో ఉన్న ప్రభుత్వ డిగ్రీ కాలేజీ నూతన భవన నిర్మాణం కోసం రూ.6.10 కోట్లు విడుదల చేశామని యోగితారాణా తెలిపారు.

## పంచాయతీ కార్యదర్శుల సమస్యలు పరిష్కరిస్తాం

- మంత్రి సీతక్క
- పంచాయత్ సెక్రటరీస్ ఫెడరేషన్ ప్రతినిధులతో భేటీ

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

పంచాయతీ కార్యదర్శుల సమస్యల పరిష్కారంలో ప్రభుత్వం సానుకూలంగా ఉందని ఆ శాఖ మంత్రి డాక్టర్ దనసరి అనసూయ సీతక్క అన్నారు. శనివారం ప్రజాభవన్‌లో తెలంగాణ పంచాయత్ సెక్రటరీస్ ఫెడరేషన్ ప్రతినిధులు, పంచాయతీ కార్యదర్శులు ఆమెతో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా వారు మంత్రిని సన్మానించారు. పంచాయతీలకు పెండింగ్‌లో ఉన్న రూ.104 కోట్ల బిల్లులు విడుదల చేయడం, డిప్యూటేషన్‌లకు అనుమతి ఇవ్వడం వంటి నిర్ణయాలు తీసుకున్నందుకు ఈ సందర్భంగా వారు మంత్రి సీతక్కకు కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో ఫెడరేషన్ రాష్ట్ర అధ్యక్షులు ఏ. శ్రీకాంత్ గౌడ్, కోశాధికారి ఎం. శశిధర్, రాష్ట్ర నాయకులు ఎం. హరికృష్ణ, రంగారెడ్డి జిల్లా అధ్యక్షులు పి. శివకుమార్, రాష్ట్ర జాయింట్ సెక్రటరీ సాపాటి పాండు తదితరులు పాల్గొన్నారు.

తెలంగాణ పంచాయితీ రాజ్ శాఖలో పనిచేస్తున్న గ్రామపంచాయతి ఉద్యోగులు (కారోబార్ల) సంఘం ప్రతినిధులు కూడా మంత్రి సీతక్కను ప్రజా భవన్‌లో కలిశారు. 35 ఏండ్లుగా గ్రామపంచాయతీలో కారోబార్లుగా పనిచేస్తున్న తమకు జీవో 51 నుంచి మినహాయించి, బిల్ కలెక్టర్లుగా ప్రమోషన్ ఇచ్చి, పే స్కేల్ వర్తింపచేయాలని మంత్రికి వినతి పత్రం సమర్పించారు. దీనిపై వెంటనే స్పందించిన ఆమె ఫైల్‌ను సిద్ధం చేయాలని అధికారులను ఆదేశించారు. పే స్కేల్‌పై చర్చించి నిర్ణయం తీసుకుంటామని హామీ ఇచ్చారు. మంత్రిని కలిసిన వారిలో గ్రామపంచాయతీ కారోబార్స్ రాష్ట్ర నాయకులు మామిడాల నర్సింహులు, శ్రీనివాస చారి, రవి యాదవ్, నాగరాజు, శ్రీధర్ యాదవ్, వెంకటేష్, సురేందర్, కట్టయ్య తదితరులు ఉన్నారు.

## జూబ్లీహిల్స్‌కు 40 మంది స్టార్ క్యాంపెయినర్స్

- ఏఐసీసీ ప్రకటన

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో ప్రచారం నిర్వహించేందుకు 40 మంది స్టార్ క్యాంపెయినర్స్‌ను ఏఐసీసీ ప్రకటించింది. అందులో రాష్ట్ర కాంగ్రెస్ వ్యవహారాల ఇన్‌చార్జి మీనాక్షి నటరాజన్, ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి, టీపీసీసీ అధ్యక్షులు మహేశ్‌కుమార్‌గౌడ్, డిప్యూటీ సీఎం మల్లు భట్టి విక్రమార్కతోపాటు మంత్రులు, ఎంపీలు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, సీనియర్ నాయకులు, అనుబంధ సంఘాల చైర్మెన్లు ఉన్నారు.

## పద్మశ్రీ అవార్డు గ్రహీత దర్శనం మొగులయ్యకు కేటీఆర్ భరోసా..

- ఇంటి స్థలం సమస్య, కంటి చికిత్స బాధ్యత తీసుకున్న కేటీఆర్..
- తను కట్టుకున్న ఇంటిని గోడలను కబ్జాదారులు కూల్చి వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసిన మొగులయ్య
- తనకు గత ప్రభుత్వం ఇచ్చిన భూమిని కాపాడి తమ కుటుంబానికి అండగా నిలబడాలని విజ్ఞప్తి చేసిన మొగులయ్య..



వివరాలు 4వ పేజీలో

## బీజేపీ ఎంపీలు రాజీనామా చేయాలి

- తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత

బలగం టీవీ, హైదరాబాద్ బ్యూరో



రాష్ట్రంలోని బీజేపీకి చెందిన 8 మంది ఎంపీలు రాజీనామాలు చేస్తే, కేంద్రం నుంచి బీసీ రిజర్వేషన్ల బిల్లు తక్షణం ఆమోదం పొందుతుందని తెలంగాణ జాగృతి అధ్యక్షురాలు కల్వకుంట్ల కవిత అన్నారు. ఆ ఎంపీలకు నిజంగానే చిత్తశుద్ధి ఉంటే, తక్షణం రాజీనామాలు చేయాలనీ, లేనిపక్షంలో వారి ఇండ్లను ముట్టడిస్తామని హెచ్చరించారు. బీసీల బంద్‌కు మద్దతుగా శనివారంనాడిక్కడి ఖైరతాబాద్ చౌరస్తాలో ఆమె భారీ మానవహారం నిర్మించారు. అంతకుముందు ఆటోలతో ప్రదర్శనగా ఖైరతాబాద్ చౌరస్తాకు చేరుకున్నారు. ఈ సందర్భంగా కాంగ్రెస్, బీజేపీలపై తీవ్ర విమర్శలు చేశారు. కాంగ్రెస్ దొంగ జీవోలు ఇస్తే, బీజేపీ నేతలు రాష్ట్రంలో అనుకూలంగా ప్రకటనలు చేస్తూ, కేంద్రంలో అడ్డుపడుతున్నారని విమర్శించారు. హంతకులే నివాళులు అర్పించినట్టుగా వీరిద్దరి తీరు ఉందని ఎద్దేవా చేశారు. త్యాగాల ద్వారానే తెలంగాణ ఏర్పడిందనీ, బీజేపీ ఎంపీల కూడా పదవులు త్యాగాలు చేస్తే, బీసీ రిజర్వేషన్లు తక్షణం వచ్చేస్తాయని అన్నారు. కార్యక్రమంలో యూపీఎఫ్ కన్వీనర్ బొల్ల శివశంకర్, తెలంగాణ జాగృతి వర్కింగ్ ప్రెసిడెంట్ ఎల్. రూప్ సింగ్, ప్రధాన కార్యదర్శి నవీన్ ఆచారి తదితరులు పాల్గొన్నారు. కవిత కుమారుడు ఆదిత్య కూడా ప్లకార్డులు పట్టుకొని ఆందోళనలో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది.

తెలంగాణ జాగృతికి అనుబంధంగా తెలంగాణ జాగృతి టీచర్స్ ఫెడరేషన్ (టీజేటీఎఫ్)ను ఏర్పాటు చేస్తున్నట్టు శనివారం కల్వకుంట్ల కవిత తెలిపారు. ఈ సందర్భంగా ఆ సంఘం లోగోను ఆమె ఆవిష్కరించారు. ప్రొఫెసర్ జయశంకర్ తనకు ఇష్టమైన ఉపాధ్యాయులు అనీ, తెలంగాణ సాధనలో టీచర్లది కీలక పాత్ర అని చెప్పారు. వారి సమస్యలపై పోరాడతామనీ, పెండింగ్‌లో ఉన్న పీఆర్సీ, డీఏ లు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. కార్యక్రమంలో టీజేటీఎఫ్ అధ్యక్షులు మోరం వీరభద్రరావు, అడ్‌హక్ కమిటీ సభ్యులు ఘనపురం దేవేందర్, జాడి శ్రీనివాస్, తానిపర్తి తిరుపతిరావు, ఎం. కవిత, సుజాత తదితరులు పాల్గొన్నారు.



## తేమ శాతం ఆధారంగా ధాన్యం కొనుగోలు చేయాలి..

- కేంద్రాల్లో రైతులకు అన్ని వసతులు కల్పించాలి..
- సన్నరకం ధాన్యానికి రూ. 500 బోనస్
- గ్రేడ్ ఏ రకానికి రూ. 2389, కామన్ రకానికి రూ. 2369
- అదనపు కలెక్టర్ గడ్డం నగేష్
- ఖరీఫ్ సీజన్ ధాన్యం సేకరణపై ఐకేపీ సెంటర్ల బాధ్యులకు శిక్షణ

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

తేమ శాతం ఆధారంగా ధాన్యం కొనుగోలు చేయాలని అదనపు కలెక్టర్ గడ్డం నగేష్ ఆదేశించారు. ఖరీఫ్ సీజన్ 2025- 26 ధాన్యం సేకరణపై ఐకేపీ సెంటర్ల బాధ్యులకు జిల్లా సమీకృత కార్యాలయాల సముదాయంలో శుక్రవారం శిక్షణ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా అదనపు కలెక్టర్ మాట్లాడుతూ.. రాష్ట్ర ప్రభుత్వ ఆదేశాల మేరకు కలెక్టర్ ఎం. హరిత మహిళా సంఘాల బాధ్యులకు ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఎక్కువ సంఖ్యలో కేటాయించారని తెలిపారు. మహిళా సంఘాల బాధ్యులు ప్రభుత్వ నిబంధనల ప్రకారం తేమ శాతం, నాణ్యత ఆధారంగా ధాన్యం కొనుగోలు చేయాలని సూచించారు. సరైన తేమ శాతం వచ్చిన రైతుల ధాన్యం సేకరించి, కేటాయించిన రైస్ మిల్లులకు మాత్రమే తరలించాలని ఆదేశించారు.

గ్రేడ్ ఏ రకానికి రూ. 2389, కామన్ రకానికి రూ. 2369 ధర ప్రభుత్వం నిర్ణయించిందని వివరించారు. సన్న రకం ధాన్యం క్వింటాలుకు అదనంగా బోనస్ రూ. 500 ప్రభుత్వం ఇస్తుందని తెలిపారు. వ్యవసాయ శాఖ అధికారులు నిర్ధారించిన సన్న రకం ధాన్యానికి మాత్రమే బోనస్ అందుతుందని పేర్కొన్నారు. ప్రతి కేంద్రం లో విద్యుత్ కనెక్షన్ తీసుకోవాలని, రైతులకు షామియానా, నీటి సదుపాయం కల్పించాలని సూచించారు. తేమ శాతం, తాలు, తప్ప తదితర అంశాలపై అవగాహన కల్పించాలని తెలిపారు. రైతులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ఏర్పాట్లు చేయాలని సూచించారు. మహిళా సంఘాల బాధ్యులు ధాన్యం పక్కగా కొనుగోలు చేసి, ఆర్థికంగా బలపడాలని పేర్కొన్నారు. ధాన్యం సేకరణ పూర్తి అయిన వెంటనే రైతుల వివరాలు ట్యాబ్ ఎంట్రీ చేయాలని, అన్నదాతల బ్యాంకు ఖాతాల్లో డబ్బులు జమ అయ్యేలా చూడాలని సూచించారు. కార్యక్రమంలో డీఆర్డీఓ శేషాద్రి, డీసీఎస్ఓ చంద్ర ప్రకాశ్, అదనపు డీఆర్డీఓ శ్రీనివాస్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు భాగ్య, ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

## సంపూర్ణంగా బిసి బంద్..

**బలగం టీవీ, బోయినిపల్లి:**



42 శాతం బీసీ రిజర్వేషన్ల కోసం బీసీ సంఘాల జెఎసి పిలుపు మేరకు భారతీయ జనతా పార్టీ రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల శాఖ సంపూర్ణంగా తెలంగాణ బంద్ (బీసీ బంద్)"లో పాల్గొని శనివారం రోజున మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా అధ్యక్షులు ఎడపల్లి పరశురామ్ మాట్లాడుతూ.. బీసీ రిజర్వేషన్ అమలు కాదని స్వయంగా ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నిండు అసెంబ్లీలో చెప్పారు. అన్నీ తెలిసి కూడా బీసీలను మోసం చేస్తున్నారని, తమిళనాడు ఒక్కటి మాత్రమే నిజాయితీగా రిజర్వేషన్లు అమలు చేసిందని అన్నారు.పెరియార్ మొదలు అనేక గొప్ప ఉద్యమాలు జరిగాయి. 21 మంది రిటైర్డ్ ఐఎఎస్ అధికారులతో రెండేళ్ల పాటు బీసీల ఆర్థిక, సామాజిక, విద్య అన్ని రంగాలపై సమగ్ర సర్వే చేసి,ఆ రిపోర్ట్ తో రాజ్యాంగంలో 9వ షెడ్యూల్ లో చేర్చారు.ఈ ప్రభుత్వం కూడా పేరుకు కమీషన్లు వేశారు తప్ప, నిజాయితీ లేదు అని లెక్కలు తీశారు. కానీ అవన్నీ తప్పుల తడక. 52 శాతం ఉంటే 42 శాతం అని కాకి లెక్కలు చెప్తున్నారు.ప్రాంతీయ పార్టీలు అధికారంలో ఉన్నంత కాలం ఆ కుటుంబం వారికే అధికారం దక్కుతుంది, కుటుంబమే ఏలుతుందనీ అన్నారు. కాంగ్రెస్ పార్టీ జాతీయ పార్టీ అయినా,స్వతంత్రం వచ్చినప్పటినుండి ఒక్క బీసీ, ఒక ట్రైబల్ ముఖ్యమంత్రి కాలేక పోయారని,ఈ రాష్ట్రంలో బీసీలు 8 మంది మంత్రులుండాలి కానీ ముగ్గురున్నారు. ఉన్నా వారికి ఇచ్చిన మంత్రి శాఖలు చిన్నవి. బీసీల పట్ల ముసలికన్నీరు కాకపోతే నామినేటెడ్ పోస్టుల్లో ఎందుకు బీసీలకు స్థానం కల్పించలేదు. మోదీ క్యాబినెట్ లో 27 మంది ఓ బి సి మంత్రులు ఉన్నారని, బీజేపీ నిజాయితీని ఎవరు శంకించలేరు. మాదిగ రిజర్వేషన్ చేస్తామని మాట ఇచ్చి, అమలు చేసిన ప్రధాన మంత్రి నరేంద్ర మోదీ అని కొనియాడారు. తమిళనాడులో ఏ పద్ధతి ప్రకారం చేశారో అదే పద్ధతిలో ఇక్కడ కూడా చెయ్యాలని, ఈ ఉద్యమం ఇక్కడితో ఆగదని,బీసీ బంద్ విజయవంతం కావడం తొలిసారి. 42 శాతం రిజర్వేషన్ల స్థానిక సంస్థల్లో మాత్రమే కాదు, చట్టసభల్లో కూడా రిజర్వేషన్లు వచ్చే వరకు ఆగదు. మరొక్కసారి తెలంగాణ బంద్ (బీసీ బంద్)" కు సహకరించిన బీసీ సంఘాల నాయకులకు, మండల ప్రజలకు కృతజ్ఞతలు తెలిపారు. ఆశయాన్ని ముద్దాడే వరకు ఐక్యంగా ఉద్యమాలు చేద్దాం అని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో బిజెపి జిల్లా కౌన్సిల్ సభ్యులు ఉదారి నరసింహ చారి, నాయకులు రాజూరి కిరణ్, సారంపల్లి రాజు, స్వామి, కుమార్, కల్యాణ అనిల్ కుమార్, మధు, ప్రదీప్, సాయికుమార్, బ్రహ్మ ప్రసాద్, నాయకులు పాల్గొన్నారు.

## వివాహ వేడుకకు హాజరైన చల్మెడ..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



కోనరావుపేట మండలం కమ్మరిపేట తండాకు చెందిన మాజీ సర్పంచ్ సూర్యనారాయణ కుమారుడు వివాహం శనివారం జరగగా ఈ వేడుకకు బిఆర్ఎస్ పార్టీ వేములవాడ నియోజకవర్గ ఇన్చార్జి చల్మెడ లక్ష్మీనరసింహారావు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సెస్ వైస్ చైర్మన్ దేవరకొండ తిరుపతి, మండల అధ్యక్షుడు మల్యాల దేవయ్య సీనియర్ నాయకులు రాఘవ రెడ్డి, ప్రభాకర్ రావు, ప్రతాప్ రెడ్డి, రాములు నాయక్, సంతోష్, మహేందర్, గొప్ప పర్ష రాములు, గంగాధర్, జగన్ నాయక్, తిరుపతి నాయక్, శివతేజ, సాయి, ప్రవీణ్ తదితరులు పాల్గొన్నారు.

## పెండింగ్ పనులను త్వరతగతిన పూర్తి చేయాలి..

- ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్

**బలగం టీవీ, వేములవాడ**



వేములవాడ నియోజకవర్గ పరిధిలో పెండింగ్ పనులను త్వరగా పూర్తి చేయాలని రాష్ట్ర ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ అన్నారు. శనివారం వేములవాడ లోని ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో పంచాయతీరాజ్ శాఖ అధికారులతో ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్ సమీక్ష సమావేశం నిర్వహించారు. నియోజక వర్గ పరిధిలో గల ప్రస్తుతం నిర్మాణంలో ఉన్న రోడ్లు, పలు పనుల తదితర వివరాలను అడిగి తెలుసుకున్నారు. నియోజకవర్గ పరిధిలో నిర్మాణంలో ఉన్నా రోడ్లు,ఇప్పటికి ప్రారంభించని పనులు, సిఆర్ఆర్,ఎంఆర్ఆర్ పనులను సకాలంలో పూర్తి చేయాలని అధికారులకు విప్ ఆది శ్రీనివాస్ సూచించారు. ఈ సమావేశంలో ఈఈలు సుదర్శన్ రెడ్డి, లక్ష్మణ్ రావు, డిఈలు పవనవ కుమారి, సత్యనారాయణ విష్ణు వర్ధన్, ఏ ఈ లు తదితరులు పాల్గొన్నారు.

## మహిళలకు అక్షరాస్యతపై అవగాహన కల్పించాలి..



- కలెక్టర్ ఎం హరిత
- ఉల్లాస్ పై సమీక్ష సమావేశం..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

జిల్లాలోని నిరక్షరాస్య వయోజన మహిళలకు అక్షరాస్యతపై అవగాహన కల్పించాలని కలెక్టర్ ఎం. హరిత ఆదేశించారు. అండర్ స్టాండింగ్ లైఫ్ లాంగ్ లెర్నింగ్ ఫర్ ఆల్ ఇన్ సొసైటీ (ఉల్లాస్)పై జిల్లా గ్రామీణాభివృద్ధి శాఖ, విద్యాశాఖ, మెప్మా శాఖ అధికారులతో శుక్రవారం సమీకృత జిల్లా కార్యాలయాల సముదాయంలో సంబంధిత శాఖల జిల్లా అధికారులతో సమీక్ష నిర్వహించారు.

జిల్లాలోని నిరక్షరాస్య వయోజన మహిళలకు ఫౌండేషనల్ లిటరసీ, బేసిక్ ఎడ్యుకేషన్ తదితర అంశాలపై అవగాహన అందించడం ఈ కార్యక్రమం యొక్క ముఖ్య ఉద్దేశ్యమని పేర్కొన్నారు. వయోజనుల కోసం అక్షర వికాసం, వాలంటీర్ల కోసం మార్గదర్శిని పుస్తకాలు ప్రభుత్వం జిల్లాకు పంపిణీ చేసిందని తెలిపారు. అక్షర వికాసం పుస్తకాలు 21,894 రాగా, మార్గ దర్శిని 2,190 పుస్తకాలు వచ్చాయని వెల్లడించారు. ఈ సంవత్సరం జిల్లాలో 23, 387 మంది వయోజనులను గుర్తించామని పేర్కొన్నారు. ఇట్టి కార్యక్రమాన్ని క్షేత్ర స్థాయిలో ప్రభావవంతంగా అమలు చేసేందుకు నిర్దిష్టమైన కార్యాచరణ రూపొందించాలని ఆదేశించారు. సమావేశంలో డీఆర్డీఓ శేషాద్రి, అడిషనల్ డిఆర్ డి ఓ శ్రీనివాస్, ట్రైనీ డిప్యూటీ కలెక్టర్ నిఖిత, వయోజన విద్య శాఖ అధికారి ఆంజనేయులు, అన్ని మండలాల ఎంఈఓలు, ఏపీఎంలు తదితరులు పాల్గొన్నారు.

## సుందరయ్య నగర్ పీహెచ్‌సీని ఆకస్మికంగా తనిఖీ చేసిన డీఎంహెచ్ఓ



- టీకాలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని ఆదేశం

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి రాజన్న సిరిసిల్ల డాక్టర్ రజిత ఈరోజు సిరిసిల్ల పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పి. సుందరయ్య నగర్ లో వ్యాధి నిరోధక టీకా కేంద్రాన్ని ఆకస్మికంగా తనిఖీ చేశారు. వైద్య అధికారులు మరియు సిబ్బందికి పలు సూచనలు చేశారు. జిల్లా వైద్య మరియు ఆరోగ్య శాఖ అధికారి మాట్లాడుతూ, 0 నుండి 5 సంవత్సరాల లోపు పిల్లలందరికీ వ్యాధి నిరోధక టీకాలు షెడ్యూల్ ప్రకారంగా ఇవ్వాలని అన్నారు. తల్లిదండ్రులు విధిగా పిల్లలకు టీకాలు ఇప్పించాలని కోరారు. ఈ సందర్భంగా ఆరోగ్య కేంద్ర సిబ్బందితో అన్ని జాతీయ ఆరోగ్య కార్యక్రమాలపై రివ్యూ నిర్వహించారు మరియు రికార్డులు పరిశీలించారు. సిబ్బంది సమయపాలన పాటించాలని, విధుల పట్ల నిర్లక్ష్యం ఉండకూడదని ఆదేశించారు.

## కోడెలను సంరక్షించి.. వ్యవసాయానికి వినియోగించాలి..

- పక్కదారి పట్టించే వారి పై కఠిన చర్యలు తీసుకుంటాం..
- ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్
- అర్హతలు ఉన్న వారికే 102 జతల జీవాల పంపిణీ..
- కలెక్టర్ ఎం. హరిత

**బలగం టీవీ, వేములవాడ:**



వేములవాడ శ్రీ రాజరాజేశ్వర స్వామి వారి గోశాలల నుంచి అందించే కోడెలను సంరక్షించి.. వ్యవసాయ పనులకు వినియోగించుకోవాలని ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ పిలుపు నిచ్చారు. వేములవాడ పట్టణం తిప్పాపూర్ లోని శ్రీ రాజరాజేశ్వర స్వామి గోశాల లో రైతులకు శుక్రవారం కోడెలను ఉచిత పంపిణీ కార్యక్రమాన్ని నిర్వహించగా, ముఖ్య అతిథిగా హాజరై ప్రభుత్వ విప్ అందజేశారు.

ఈ సందర్భంగా ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ మాట్లాడారు. దేశంలో ఎక్కడా లేని విధంగా స్వామి వారికి కోడెలను కట్టే సంస్కృతి వేములవాడ రాజ రాజేశ్వర స్వామి వారి సన్నిధిలో ఉందని గుర్తు చేశారు. భక్తుల విశ్వాసానికి ప్రతీక కోడె మొక్కు చెల్లింపు అని వివరించారు. తెలంగాణ రాష్ట్రంలో ప్రజా ప్రభుత్వం ఏర్పడిన నాటి నుంచి ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి నేతృత్వంలో రైతులకు తిప్పాపూర్ గోశాలలో ఉచితంగా స్వామివారి కోడెలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. పంపిణీ చేసిన కోడెలను తనిఖీ చేయిస్తామని స్పష్టం చేశారు. కోడెలను పక్కదారి పట్టించి ఇతర అవసరాలకు ఉపయోగిస్తే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

రాష్ట్ర ప్రభుత్వం వేములవాడలో అధునాతన సౌకర్యాలతో 40 ఎకరాల్లో సువిశాల స్థలంలో గోశాల నిర్మాణానికి అనుమతి ఇచ్చిందని, అనువైన స్థలాన్ని ఎంపిక చేసి ప్రభుత్వానికి ప్రతిపాదనలు పంపించామని తెలిపారు. త్వరలోనే పనులు ప్రారంభిస్తామని వెల్లడించారు. రాజన్నకు కోడె మొక్కులు చెల్లించే భక్తులు పాలు మరిచిన తర్వాత జీవాలను అందజేయాలని విప్ కోరారు.

**కోడెల పంపిణీని పరిశీలించిన కలెక్టర్**

కలెక్టర్ ఎం హరిత మాట్లాడుతూ.. ఆన్లైన్ లో అన్ని పత్రాలతో దరఖాస్తు చేసుకున్న రైతులకు మాత్రమే కోడెలను పంపిణీ చేస్తున్నామని తెలిపారు. రైతులు వాటిని వ్యవసాయ పనులకు వినియోగించాలని సూచించారు. ఆన్లైన్ లో దరఖాస్తు చేసుకున్న పత్రాలను పరిశీలించి కోడెలను పంపిణీ చేశారు. మొత్తం 102 జతల కోడెలను పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆలయ ఈఓ రమాదేవి, జిల్లా పశు సంవర్ధక శాఖ అధికారి రవీందర్ రెడ్డి, వ్యవసాయ అధికారి అఫ్జల్ బేగం, తహసీల్దార్ విజయ ప్రకాష్ రావు, వ్యవసాయ శాఖ అధికారులు, గోశాల బాధ్యులు తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్లకు రాష్ట్ర ప్రభుత్వ విప్ ధర్నా..

- **బీజేపీ, బీఆర్ఎస్‌లపై ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ ఫైర్..**

**బలగం టీవీ, వేములవాడ**

బీసీ సంఘాల జేఏసీ (జాయింట్ యాక్షన్ కమిటీ) ఇచ్చిన పిలుపు మేరకు, బీసీ రిజర్వేషన్ల అంశంపై నిరసనగా వేములవాడలో బంద్ కొనసాగుతోంది. ఈ బంద్‌కు మద్దతుగా కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో వేములవాడ ఆర్టీసీ డిపో వద్ద రాష్ట్ర ప్రభుత్వ విప్, వేములవాడ ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ నాయకత్వంలో ధర్నా నిర్వహించారు.

తెలవారుజాము నుండే వేములవాడ ఆర్టీసీ డిపో నుండి బస్సులు బయటకు వెళ్లకుండా నాయకులు అడ్డుకున్నారు. బంద్ కొనసాగుతున్న తీరును, బస్సుల రాకపోకలను ఎమ్మెల్యే ఆది శ్రీనివాస్ స్వయంగా బైక్‌పై వెళ్లి పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన అధికార పార్టీ బీఆర్?ఎస్? మరియు కేంద్రంలోని బీజేపీపై తీవ్రస్థాయిలో విమర్శలు చేశారు.ఈ సందర్భంగా ప్రభుత్వ విప్ ఆది శ్రీనివాస్? మాట్లాడుతూ.. "రాష్ట్రంలో 8 మంది




బీజేపీ ఎంపీలు ఉన్నారు. బీసీల అంశంపై ప్రధాని మోడీ దగ్గర ఎందుకు మాట్లాడలేక పోతున్నారు? రాష్ట్రంలో 'సై' అంటున్నారు ఢిల్లీలో బీజేపీ వాళ్ళు 'నై' అంటున్నారు. ఎందుకు యూ టర్న్ తీసుకుంటున్నారు?" అని ప్రశ్నించారు."బీసీ బిడ్డల నోటి నుంచి వచ్చిన ముద్దను తీసివేయవద్దు. వారికి న్యాయం చేయాలి," అని డిమాండ్ చేశారు. "ఢిల్లీలో జంతర్ మంతర్ వద్ద బీసీ సంఘాల వారికి బీఆర్ఎస్ నేతలు ఎందుకు మద్దతు ఇవ్వలేక పోయారు?" అని నిలదీశారు. రాజన్న సిరిసిల్ల జిల్లాలో బీఆర్ఎస్ నాయకులు బీజేపీకి వ్యతిరేకంగా మాట్లాడలేక పోతున్నారని అన్నారు.. బీసీ సంఘాల జేఏసీ పిలుపు మేరకు జరుగుతున్న ఈ ధర్నా మరియు బంద్‌కు కాంగ్రెస్ పార్టీ సంపూర్ణ మద్దతు తెలుపుతున్నామని అన్నారు. రాష్ట్రంలో బీసీలకు రిజర్వేషన్లు మరియు ఇతర హక్కుల విషయంలో జరుగుతున్న జాప్యాన్ని, ప్రభుత్వాల వైఖరిని ఈ సందర్భంగా కాంగ్రెస్ పార్టీ నాయకులు తీవ్రంగా ఖండించారు.

# పత్తి పంట వేసిన రైతుల వివరాలను రైతు భరోసా పోర్టల్‌లో నమోదు చేసుకోవాలి..

- **మండల వ్యవసాయ అధికారిని ప్రణీత**

**బలగం టీవీ, బోయినిపల్లి**




కేంద్ర ప్రభుత్వం ప్రతి సంవత్సరం లాగానే కాటన్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (సీసీఐ) ద్వారా ప్రత్తి కొనుగోళ్లు జరుపుతుంది. దీని కొరకు రైతులు కపాస్ కిసాన్ ఆప్ ని ప్లేస్టోర్ నుండి డౌన్ లోడ్ చేసుకుని, రైతు భరోసా పోర్టల్ లో ఉన్న ఫోన్ నెంబర్ ద్వారా లాగిన్ కావాలి. వెరిఫికేషన్ కోరకి రైతు యొక్క మొబైల్ నెంబర్ కి ఓ.టి.పి వెళ్తుంది.ఈ యాప్ లోనికి వెళ్లి భాషని ఎంపిక చేసుకోవాలి. తెలుగు భాష అందుబాటులో ఉంది.ఈ వానాకాలంలో వ్యవసాయ విస్తీర్ణ అధికారులు ప్రత్తి పంట వేసిన రైతుల వివరాలను రైతు భరోసా పోర్టల్ లో పంట నమోదు చేసినారు.వీరి వివరాలు కపాస్ కిసాన్ ఆప్ కీ త్వరలో అనుసంధానం చేస్తారు. రైతులు కపాస్ కిసాన్ ఆప్ లో తమ మొబైల్ నెంబర్ తో లాగిన్ అయినాక, వారు సాగు చేసే ప్రత్తి పంట విస్తీర్ణం కనపడుతుంది. ప్రత్తిని ప్రభుత్వానికి కొనుగోలు చేసేముందు, ఇంటి వద్దనే కపాస్ కిసాన్ ఆప్ లోనికి వెళ్లి బుక్ స్లాట్ అనే విభాగంలోనికి వెళ్లి, అందులో మీ గ్రామానికి అనుసంధానం చేసిన జిన్నింగ్ మిల్లులు కనిపిస్తాయి. అందులో మీరు తీసుకువెళ్లాలని, అనుకున్న జిన్నింగ్ మిల్ ని ఎంపిక చేసుకుని, అనువైన తేది ఎంపిక చేసుకుని స్లాట్ బుక్ చేసుకోవాలి. స్లాట్ బుక్ అయ్యాక రైతుకు మెసేజ్ కూడా వారి మొబైల్ నంబర్లకు వస్తుంది. రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలంలో సుమారు 6500 ఎకరాల్లో ప్రత్తి పంటను సాగు చేశారు. ఈ రైతులలో కొద్ది మందివి మొబైల్ నెంబర్లు పనిచేయక పోవడం, మార్చడం జరిగింది.ఇట్టి రైతులు తప్పకుండా వారి మొబైల్ నెంబర్ ని ఈ నెల 23వ తేది లోగా మీ వ్యవసాయ విస్తీర్ణ అధికారులను సంప్రదించి, పోర్టల్ లో సరి చేసుకోగలరని మండల వ్యవసాయ అధికారిని ప్రణీత తెలిపారు.

## "మేమెంతో మాకంత" నినాదంతో

# జిల్లెల్ల గ్రామంలో బీసీ ఐక్యవేదిక ధర్నా..



- **42 శాతం రిజర్వేషన్లు ప్రకటించాలని డిమాండ్**
- **అంబేద్కర్ కి వినతి పత్రం..**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

బీసీలకు విద్య, ఉపాధి, రాజకీయ రంగాల్లో 42 శాతం రిజర్వేషన్లు ప్రకటించాలని డిమాండ్ చేస్తూ జిల్లె ల గ్రామంలో బీసీ ఐక్యవేదిక ఆధ్వర్యంలో భారీ ధర్నా నిర్వహించడం జరిగింది. 'మేమెంతో మాకంత' అనే నినాదంతో చేపట్టిన ఈ కార్యక్రమంలో, బీసీలు తమ జనాభాకు అనుగుణంగా రిజర్వేషన్లు కల్పించాలని బలంగా కోరారు. ధర్నా అనంతరం, అంబేద్కర్ గారి చిత్రపటానికి వినతి పత్రం సమర్పించారు. విద్య, ఉపాధి, రాజకీయ రంగాలలో 42 శాతం రిజర్వేషన్లు తక్షణమే ప్రకటించాలి. అన్ని రాజకీయ పార్టీలు ఈ రిజర్వేషన్ల డిమాండ్‌కు బేషరతుగా మద్దతు తెలియజేసి, రిజర్వేషన్లు వచ్చే విధంగా కృషి చేయాలి. బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలుపరిచేంతవరకు, స్థానిక సంస్థల ఎన్నికలు నిర్వహించవద్దు. ఈ ధర్నాలో బీసీ సంఘం అధ్యక్షుడు తాళ్లపల్లి శ్రీనివాస్, పాక్స్ చైర్మన్ కోడూరు భాస్కర్ గౌడ్, మొగిలి కరుణాకర్, బాలసాని నరసయ్య, గీ సా నరసయ్య, కొత్తపల్లి శ్రీనివాస్ యాదవ్, పూనం తిరుపతి, గుండెల్లి క్రాంతి సుమన్, గీస కనకయ్య, తుపాకుల సత్తయ్య, బోయ రాజు, పర్శాములు, తుపాకుల శోభా, గంధం సంపత్ తదితరులు పాల్గొన్నారు.



# సీఎం చిత్రపటానికి పాలాభిషేకం

**బలగం టీవీ, బోయినిపల్లి**

ముగ్గురు సంతానం ఉన్న వారిని ఎన్నికల్లో పోటీ చేసేందుకు అర్హులుగా ప్రకటించినందుకు రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల కేంద్రంలో పలువురు టపాసులు పేల్చి సీఎం, మంత్రులు, చొప్పదండి ఎమ్మెల్యే మేడిపల్లి సత్యం చిత్రపటానికి పాలాభిషేకం చేశారు. ఈ సందర్భంగా నాయకులు ఏనుగుల కనకయ్య మాట్లాడుతూ.. రాజకీయ అనుభవం నుండి ప్రజాసేవలో ఉండాలనుకునే నాయకులకు ముగ్గురు సంతానం ఉన్న కారణంగా గత ప్రభుత్వాలు పోటీ చేయకుండా చేయడంతో ఎంతో నిరుత్సహానికి గురయ్యారని,గురువారం రోజున అసెంబ్లీలో ముగ్గురు సంతానం ఉన్న వారిని సైతం పోటీ చేయడానికి అర్హులుగా ప్రకటించిన సందర్భంగా ధన్యవాదాలు తెలుపుతూ సంబరాలు చేసుకున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ యాదవ్,కాంగ్రెస్ పార్టీ మండల అధ్యక్షులు వన్నెల రమణారెడ్డి, బీసీ, ఎస్సీ,ఎస్టీ గ్రామ జేఏసీ చైర్మన్ మాడిశెట్టి గంగయ్య, కొప్పుల బుచ్చి రాములు, మాడిశెట్టి జనార్ధన్, నల్ల మోహన్ తదితరులు ఉన్నారు.

# బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలని బీఆర్ఎస్ ధర్నా..

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**



బీసీలకు 42 శాతం రిజర్వేషన్లను తక్షణమే అమలు చేయాలంటూ బిఆర్ఎస్ పార్టీ ఆధ్వర్యంలో రాజన్న సిరిసిల్ల కేంద్రంలోని అంబేద్కర్ చౌక్‌లో శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. అసెంబ్లీలో బీసీ రిజర్వేషన్లకు బీఆర్ఎస్ పార్టీ మద్దతు తెలిపిన విషయాన్ని గుర్తు చేశారు. ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి వెంటనే కేంద్ర ప్రభుత్వంతో సంప్రదింపులు జరిపి 42 శాతం రిజర్వేషన్ల అమలుకు కృషి చేయాలని వారు సూచించారు. ఒకవైపు రిజర్వేషన్ల కోసం ప్రయత్నిస్తున్నట్లు నటిస్తూనే, మరోవైపు తన సామాజిక వర్గానికి చెందిన వారితో కోర్టు ద్వారా రిజర్వేషన్లను అడ్డుకునేలా చేస్తున్న ముఖ్యమంత్రి ద్వంద్వ వైఖరిని వీడాలని అన్నారు. సిరిసిల్ల పట్టణంలో బీసీ జనాభా 56 శాతం ఉందని గుర్తుచేసిన బీఆర్ఎస్ నాయకులు.. బీసీ రిజర్వేషన్ల సాధన కోసం చేపట్టిన బంద్‌ను విజయవంతం చేసి, బీసీలు తమ సత్తాను చాటాలని ప్రజలను కోరారు. రిజర్వేషన్ల అమలు కోసం పోరాటం కొనసాగుతుందని వారు స్పష్టం చేశారు.

# తహశీల్దార్‌కు వినతిపత్రం అందజేసిన ఎమ్మార్పీఎస్ నాయకులు

**బలగం టీవీ, బోయినిపల్లి**



సుప్రీం కోర్టు జస్టిస్ బి.ఆర్ గావాయ్ మీద జరిగిన దాడి విషయంపై ఎమ్మార్పీఎస్ మందకృష్ణ మాదిగ ఆదేశాలు మేరకు రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల తహశీల్దార్ కు ఎమ్మార్పీఎస్ వినతిపత్రం అందించారు. ఈ కార్యక్రమంలో ఎమ్మార్పీఎస్, ఎం.ఎస్.ఎఫ్,వి.హెచ్.పి.ఎస్ జిల్లా కో కన్వీనర్ రవీందర్, మండల అధ్యక్షులు రమేష్,మండల ఉప అధ్యక్షులు ఇల్లందుల రాజు, వి.హెచ్.పి.ఎస్ మండల అధ్యక్షులు అక్కనపల్లి పర్శరాములు మరియు దళిత నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

# బీసీ రిజర్వేషన్లపై మొసలి కన్నీరు కారుస్తున్న ముఖ్యమంత్రి..



**బీఆర్ఎస్ నాయకులు అక్కెనపెల్లి కరుణాకర్**

**బలగం టీవీ, బోయినిపల్లి:**

నిజంగానే బీసీలకు 42% చట్టబద్ధత కల్పించాలని రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండలం స్తంభంపల్లి బిఆర్ఎస్ నాయకులు అక్కెనపెల్లి కరుణాకర్ అన్నారు. ఈ సందర్భంగా కరుణాకర్ మాట్లాడుతూ.. చిత్తశుద్ధి మీకు ఉంటే మీ అరచేతిలో ఉన్న అవకాశాలను మీ మంత్రివర్గ విస్తరణలో 42 శాతం బీసీలకు కేటాయించాలని,నామినేటెడ్ పదవులను 42% బీసీలకు కేటాయించాలని,మీ కాంగ్రెస్ పార్టీ నిర్మాణంలో కూడా బీసీలకు 42 శాతం కేటాయించాలని అన్నారు. అప్పుడు మాత్రమే తెలంగాణలో ఉన్న బీసీలు మిమ్మల్ని నమ్మే పరిస్థితి ఉంటుందని, లేదంటే రానున్న స్థానిక సంస్థల ఎన్నికలలో కాంగ్రెస్ పార్టీని తెలంగాణ రాష్ట్రంలో ఉన్న బీసీలంతా ఏకమై భూస్థాపితం చేస్తారని ఈ సందర్భంగా పేర్కొన్నారు.

# రైతులు ధాన్యం కొనుగోలు కేంద్రాలలో నిర్వహణకు అవసరమైన పరికరాలు సద్వినియోగించుకోవాలి

- **ఏఎంసీ ఎల్లెస్ యాదవ్**

**బలగం టీవీ, బోయినిపల్లి**



వ్యవసాయ మార్కెట్ కమిటీ రాజన్న సిరిసిల్ల జిల్లా బోయినిపల్లి మండల పరిధిలోని మార్కెటింగ్ సీజన్ వానకాలం 2025-2026 సంవత్సరంలో నిర్వహించే వరి ధాన్యం కొనుగోలు కేంద్రాల నిర్వహణకు అవసరమైన ఎం.ఎస్.పి పరికరాలు మైచర్ మీటర్, ఎలక్ట్రానిక్ కాంటాలు మరియు ప్యాడి క్లీనర్లు, జిల్లా కలెక్టర్ రైతుల ఉపయోగార్ధము ఇచ్చిన ఆదేశాల ప్రకారం ఐకెపి మరియు పిఏసిఎస్ వారికి ఎం.ఎస్.పి పరికరములు జారి చేశారు. రైతులు మీ యొక్క వరి ధాన్యాన్ని కొనుగోలు కేంద్రాల ద్వారా అమ్ముకొని మద్దతు ధర పొందగలరని మరియు ఈ కొనుగోలు కేంద్రాలకు ఇచ్చిన మద్దతు ధర పొందగలరని మరియు ఇట్టి కొనుగోలు కేంద్రాలకు ఇచ్చిన ఎం..ఎస్.పి పరికరములను రైతులు సద్వినియోగం చేసుకోవాలని వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ బోయిని ఎల్లేష్ తెలిపారు.

# గంజాయి రహిత సమాజం మనందరిదీ బాధ్యత..



- గంజాయి,డ్రగ్స్ నిర్మూలనలో ప్రజలు,విద్యార్థులు భాగస్వామ్యం కావాలి..
- తల్లిదండ్రులు పిల్లల ప్రవర్తన ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలి
- జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

వీర్నపల్లి మండలం గర్జనపల్లి సీతారం నాయక్ తండాలో శ్రీధూమ నాయక్ భూక్యా సామాజిక సేవ ట్రస్ట్ ఆధ్వర్యంలో మతుపదార్థాల వలన కలుగు అనర్థాలపై ఏర్పాటు చేసిన అవగాహన సదస్సుకు ముఖ్య అతిథిగా హాజరైన జిల్లా ఎస్పీ మహేష్ బి.గితే.

ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ.. "గంజాయి రహిత సమాజం మనందరిదీ బాధ్యత" అని పేర్కొన్నారు. డ్రగ్స్, గంజాయిని నిర్మూలించడంలో ప్రతి పౌరుడూ బాధ్యతగలవారిగా వ్యవహరించి,ఈమత్తు పదార్థాల నిర్మూలనలో భాగస్వామ్యం కావాలని ప్రజలకు, యువతకు, విద్యార్థులకు పిలుపునిచ్చారు.

విద్యార్థులు, యువత మత్తు పదార్థాలకు దూరంగా ఉండి పక్కా ప్రణాళికతో చదువుకొని ఉన్నత స్థాయి ఉద్యోగాలు సాధించాలని ఆకాంక్షించారు. డ్రగ్స్ ను వినియోగించడం వల్ల సమాజానికి ఇబ్బంది కలిగించే పౌరులుగా మారవద్దని సూచించారు.

తల్లిదండ్రులు తమ పిల్లల ప్రవర్తనను ఎప్పటికప్పుడు గమనిస్తూ ఉండాలని, అవసరమైతే సమయానుకూలంగా మార్గనిర్దేశనం చేయాలని సూచించారు. డ్రగ్స్ వినియోగం వల్ల మెదడు, కిడ్నీలు, ఊపిరితిత్తులు దెబ్బతినడంతో పాటు, ఆరోగ్యం క్రమంగా క్షీణిస్తుందని చెప్పారు. అలాగే డ్రగ్స్ వినియోగం శారీరక నష్టాలకే పరిమితం కాకుండా మానసిక సమస్యలు, సామాజిక రుగ్మతలను కూడా పెంచుతుందని వివరించారు. విద్యార్థి దశ నుంచే ప్రతి ఒక్కరూ డ్రగ్స్ వల్ల కలిగే నష్టాలపై అవగాహన పెంచుకొని వాటికి దూరంగా ఉంటూ ఉత్తమ సమాజ నిర్మాణంలో అందరూ భాగస్వాములవ్వాలని జిల్లా ఎస్పీ పిలుపునిచ్చారు.గర్జనపల్లి గ్రామానికి చెందిన సీఐడీ ఎస్పీ రాంరెడ్డి భూక్య శ్రీధూమ నాయక్ భూక్యా సామాజిక సేవ ట్రస్ట్ స్థాపించి సామాజిక సేవకార్యక్రమలు చేయడం అభినందనియమని ఎస్పీ తెలిపారు. ఎస్పీ వెంట సీఐడీ ఎస్పీ రాంరెడ్డి, శ్రీధూమ నాయక్ భూక్యా సామాజిక సేవ ట్రస్ట్ సభ్యులు, సి.ఐ శ్రీనివాస్, ఎస్.ఐ లక్ష్మణ్, విద్యార్థులు పాల్గొన్నారు.

# పద్మశ్రీ అవార్డు గ్రహీత దర్శనం మొగులయ్యకు కేటీఆర్ భరోసా..

- ఇంటి స్థలం సమస్య, కంటి చికిత్స బాధ్యత తీసుకున్న కేటీఆర్..
- తను కట్టుకున్న ఇంటిని గోడలను కబ్జాదారులు కూల్చి వేస్తున్నారని ఆవేదన వ్యక్తం చేసిన మొగులయ్య
- తనకు గత ప్రభుత్వం ఇచ్చిన భూమిని కాపాడి తమ కుటుంబానికి అండగా నిలబడాలని విజ్ఞప్తి చేసిన మొగులయ్య..

**బలగం టీవీ, హైదరాబాద్**

తెలంగాణ తొలి ముఖ్యమంత్రి కేసీఆర్ గుర్తించడం, తనకు అండగా నిలబడటం వల్లనే ఈరోజు తనకు గౌరవం దక్కిందని మొగులయ్య అన్నారు. పద్మశ్రీ అవార్డు గ్రహీత, తెలంగాణ జానపద సాహితీ ముద్దుబిడ్డ అయిన దర్శనం మొగులయ్యకు బీఆర్ఎస్ వర్కింగ్ ప్రెసిడెంట్ కేటీఆర్ అండగా ఉంటానని భరోసా ఇచ్చారు. మొగులయ్య ఈరోజు కేటీఆర్ నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు.

మొగులయ్య ఆరోగ్యం, యోగక్షేమాల గురించి కేటీఆర్ ఆరా తీశారు. ఈ సందర్భంగా మొగులయ్య తన కంటిచూపు మందగించిందని, చికిత్స కోసం ఇబ్బందులు పడుతున్న విషయాన్ని కేటీఆర్ దృష్టికి తీసుకువచ్చారు. వెంటనే స్పందించిన కేటీఆర్, మొగులయ్యకు హైదరాబాద్‌లోని ఎల్వీ ప్రసాద్ ఐ హాస్పిటల్‌లో పూర్తి చికిత్సను అందించే బాధ్యతను తాను తీసుకుంటానని హామీ ఇచ్చారు.

**మొగులయ్య ఇంటి స్థలం సమస్యపై కలెక్టర్‌కు కేటీఆర్ ఫోన్..**

అనంతరం మొగులయ్య, గత ప్రభుత్వం తనకు హయత్ నగర్ మండలంలో కేటాయించిన 600 గజాల స్థలం విషయంలో కొంతమంది వ్యక్తుల నుండి ఎదురవుతున్న ఇబ్బందులు, కోర్టు కేసుల వివరాలను కేటీఆర్‌కు వివరించారు. గత ప్రభుత్వం కోట్లాది రూపాయల విలువైన భూమిని తనకు ఉచితంగా అందిస్తే దీన్ని కొంతమంది కబ్జాదారులు కబ్జా చేసే ప్రయత్నం చేస్తున్నారని మొగులాయి అన్నారు. తాను కట్టుకున్న గోడలను ఇంటిని కూడా కులగోట్టారని, కోర్టు కేసులు వేసి వేధిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. తనకు గత ప్రభుత్వం ఇచ్చిన స్థలాన్ని కాపాడాలని కేటీఆర్ కి విజ్ఞప్తి చేశారు. ఈ అంశంలో అనేకసార్లు కలెక్టర్ల దృష్టికి తీసుకువెళ్లిన తనకు పరిష్కారం దొరకలేదని, తనకు అండగా నిలవాలని కోరారు.దీనిపై తక్షణమే స్పందించిన కేటీఆర్, రంగారెడ్డి జిల్లా కలెక్టర్ నారాయణరెడ్డికి ఫోన్ చేసి మాట్లాడారు. మొగులయ్యకు గతంలో భారత రాష్ట్ర సమితి ప్రభుత్వం కేటాయించిన భూమి విషయంలో కొందరు వ్యక్తులు కోర్టుల్లో కేసులు వేసి ఇబ్బందులకు గురిచేస్తున్నారని కలెక్టర్‌కు తెలిపారు. ఈ సమస్యను వెంటనే పరిష్కరించి, మొగులయ్యకు న్యాయం చేయాలని కోరారు. అలాగే, మొగులయ్య ఆ స్థలంలో కట్టుకున్న గదిని కూడా కొంతమంది కూల్చివేసిన పరిస్థితి ఉందని మొగులయ్య చెప్పారని పేర్కొన్నారు. మొగులయ్య భూమికి, ఆయన కుటుంబానికి తగిన రక్షణ కల్పించాలని కలెక్టర్‌కు కేటీఆర్ సూచించారు. అవసరమైతే, మొగులయ్యకు ఎదురవుతున్న న్యాయపరమైన కేసులను ఎదుర్కొనేందుకు కూడా సహాయం అందిస్తామని కేటీఆర్ హామీ ఇచ్చారు.

**కేసీఆర్‌కు మొగులయ్య కృతజ్ఞతలు..**

ఈ సందర్భంగా మొగులయ్య కేటీఆర్‌తో మాట్లాడుతూ, ఒకప్పుడు లింగాల అడవుల్లో 12 మెట్ల కిన్నెర వాయించుకునే తనకు అప్పటి ముఖ్యమంత్రి కె.సి.ఆర్. గారి ప్రేమతోనే గుర్తింపు దక్కిందని తెలిపారు. కేసీఆర్ గారు తనను గుర్తించి ఉగాది పురస్కారం ఇచ్చి గౌరవించడం వల్లనే తన కళ ప్రపంచం దృష్టికి చేరిందని, తదనంతరం పద్మశ్రీ అవార్డు కూడా దక్కిందని పేర్కొన్నారు. కేసీఆర్ గారు తమ కుటుంబం కోసం చేసిన సహాయానికి, తమ కష్టాలన్నీ తీర్చినందుకు ఎల్లప్పుడూ రుణపడి ఉంటానని, ఆయనకు ధన్యవాదాలు తెలిపారు. తన ఇంటి స్థలం వివాదాన్ని పరిష్కరించి, కోర్టు కేసుల విషయంలో సహాయం చేయాలని మొగులయ్య కేటీఆర్‌ను విజ్ఞప్తి చేశారు.



# బీసీల రాష్ట్ర బంద్ చారిత్రాత్మకం..

**బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్ష హన్మాండ్లు**

**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల**

రాష్ట్రవ్యాప్తంగా శనివారం రోజున చేపట్టిన బీసీల బంద్ చారిత్రాత్మకమని ఈ బీసీల రాష్ట్ర బంద్ పూర్తిగా విజయవంతమైందని బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర అధికార ప్రతినిధి పర్ష హన్మాండ్లు అన్నారు. తేదీ 18-10-2025 శనివారం రోజున సిరిసిల్ల జిల్లా కేంద్రంలోని బీసీ భవన్ లో సాయంత్రం పర్ష హన్మాండ్లు విలేకరుల సమావేశంలో మాట్లాడారు.ఈ సందర్భంగా పర్ష హన్మాండ్లు మాట్లాడుతూ.. బీసీల రాష్ట్ర బంద్ రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా విజయవంతమైందన్నారు. ఉదయం నుండి సాయంత్రం వరకు అన్ని విద్యాసంస్థలు, అన్ని వ్యాపార సంస్థలు బందులో పాల్గొని సహకరించారని అందులో పాల్గొన్న ప్రతి ఒక్కరికి పేరుపేరునా పర్ష హన్మాండ్లు ధన్యవాదాలు తెలియజేశారు. బీసీలకు విద్యా ఉద్యోగ రాజకీయ రంగంలో 42 శాతం రిజర్వేషన్ల అంశం అంశంలో ధర్మం న్యాయం ఉన్నది కాబట్టే ప్రతిపక్ష, అధికార పార్టీలు బీసీ సంఘాలతో చేతులు కలపాయని మద్దతు ఇచ్చాయని ఈ సందర్భంగా పర్ష హన్మాండ్లు అన్నారు. బీసీల రిజర్వేషన్ల అంశం.. బీసీల రాష్ట్ర బంద్ ఆరంభం మాత్రమేనని తుది దాకా పోరాటం చేసి రిజర్వేషన్ సాధించి తీరుతామని అన్నారు. బీసీలు గతంలో అనేక ఉద్యమాలలో త్యాగాలు చేశారని, 42 శాతం రిజర్వేషన్ల సాధనకు ప్రాణాలైనా అర్పించేందుకు సిద్ధంగా ఉన్నామని అన్నారు. బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు మద్దతు ఇస్తున్నట్టు ప్రకటించారని కానీ వారి శ్రేణులు, వాళ్ళ నాయకులు ఎక్కడ బందులో పాల్గొనలేదని దీనిని బట్టి బిజెపి పార్టీ బీసీ రిజర్వేషన్లకు వ్యతిరేకమైన పార్టీ అని దోషిగా తేలిపోయిందనీ పర్ష హన్మాండ్లు తెలిపారు.

పార్లమెంటులో 42 శాతం రిజర్వేషన్ల బిల్లులను పెట్టి ఆమోదించి రాజ్యాంగంలోని తొమ్మిదవ షెడ్యూల్లో చేర్చే వరకు ఊరుకునే ప్రసక్తే లేదని ఈ సందర్భంగా పర్ష హన్మాండ్లు అన్నారు. రాజన్న సిరిసిల్ల జిల్లా వ్యాప్తంగా బీసీల రాష్ట్ర బందులో పాల్గొన్న బీసీ సంఘాల నాయకులకు, బీసీ కుల సంఘాల నాయకులకు, అంబేద్కర్ సంఘాల నాయకులకు, ఎమ్మార్పీఎస్, మాలమహానాడు నాయకులకు, దళిత సంఘాలకు, గిరిజన సంఘాలకు అన్ని రాజకీయ పార్టీల నాయకులకు పేరుపేరునా పర్ష హన్మాండ్లు ధన్యవాదాలు తెలిపారు.



# ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ వితరణ..


**బలగం టీవీ, రాజన్న సిరిసిల్ల:**

బోయినిపల్లి మండలం కొదురుపాక ఎం.పీ.పీ.ఎస్ పాఠశాలకు 20వేల రూపాయల విలువగల 100 లీ. ప్యూరిఫైడ్ వాటర్ ప్లాంట్ ను తరిగొప్పుల మురళి- విజయ శనివారం రోజున విరాళంగా అందజేశారు. దాహార్తి తీర్చుకునేందుకు విద్యార్థులను దృష్టిలో పెట్టుకొని వితరణ చేసినందుకు గ్రామస్తులు, మండల విద్యాధికారి శ్రావణ్ కుమార్, జడ్.పి.హెచ్.ఎస్ కొదురుపాక ప్రధానోపాధ్యాయులు ఉష, ఎం.పీ.పీ.ఎస్ కొదురుపాక ప్రధానోపాధ్యాయులు రవి, సురేందర్, అమ్మ ఆదర్శ పాఠశాల చైర్పన్లు రజిత, లావణ్య, గ్రామ ప్రముఖులు పాల్గొని ప్రత్యేక కృతజ్ఞతలు తెలిపారు.

# జూబ్లీహిల్స్ నామినేషన్‌లో కాంగ్రెస్ అభ్యర్థి రౌడీయిజం..

- ఆర్ఎస్ ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి, డాక్టర్ కె. సంజయ్

**బలగం టీవీ, హైదరాబాద్**




జూబ్లీహిల్స్ నియోజకవర్గంలో కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ కార్యక్రమం సందర్భంగా రౌడీయిజం, అల్లర్లు జరిగాయని ఆరోపిస్తూ బీఆర్ఎస్ ఎమ్మెల్యేలు దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మరియు డాక్టర్ కె. సంజయ్ లు తెలంగాణ భవన్‌లో తీవ్ర స్థాయిలో మండిపడ్డారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే దేవిరెడ్డి సుధీర్ రెడ్డి మాట్లాడుతూ జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ అభ్యర్థి నామినేషన్ కార్యక్రమం అంతరాష్ట్ర రౌడీల ప్రదర్శనలా జరిగిందని, రౌడీలు కత్తులు, కటార్లతో వీరంగం చేశారని ఆయన ఆరోపించారు. నామినేషన్ కార్యక్రమం రౌడీలతో నిండిపోయినా పోలీసులు చోద్యం చూశారని, నేర చరితులను ఒకే చోట చేర్చిన ఘనత కాంగ్రెస్ పార్టీదేనని ఎద్దేవా చేశారు. "ఇప్పుడే ఇలా ఉంటే రేపు నవీన్ యాదవ్ గెలిస్తే పరిస్థితి ఎలా ఉంటుందో జూబ్లీహిల్స్ ప్రజలు ఆలోచించుకోవాలి. రౌడీ కావాలా? సౌమ్యురాలైన బీఆర్ఎస్ అభ్యర్థి మాగంటి సునీత గెలవాలా? ప్రజలు ఆలోచించాలి. రౌడీ కల్చర్ పోవాలంటే బీఆర్ఎస్ గెలవాలి," అని సుధీర్ రెడ్డి పిలుపునిచ్చారు. కాంగ్రెస్ అభ్యర్థికి ఒవైసి మద్దతు ప్రకటించి పదేళ్ల బీఆర్ఎస్ పాలనను తప్పుబడుతున్నారని, గతంలో అజారుద్దీన్‌ను ఓడించేందుకు ఎంఐఎం తన అభ్యర్థిని దించిందని, ఇపుడు ఎందుకు దింపలేదని ప్రశ్నించారు. బీహార్‌లో పోటీ చేస్తున్న ఎంఐఎం జూబ్లీహిల్స్‌లో ఎందుకు పోటీ చేయడం లేదని నిలదీశారు. కేసీఆర్ హయాంలోనే జూబ్లీహిల్స్ అభివృద్ధి జరిగిందని, ఒవైసికి ఆ అభివృద్ధి కనిపించకపోతే తాము ఏం చేయలేమని అన్నారు. బీజేపీ, బీఆర్ఎస్‌ల సిద్ధాంతాలు వేర్వేరు అని, అవి ఎలా కలుస్తాయని ప్రశ్నించారు. దొంగ ఓట్లతో గెలవాలని కాంగ్రెస్ చేసే యత్నాలను అడ్డుకుంటామని, కాంగ్రెస్ రౌడీయిజంకు ఓట్లు పడవని స్పష్టం చేశారు. ఎమ్మెల్యే డాక్టర్ కె. సంజయ్ మాట్లాడుతూ%ొ% జూబ్లీహిల్స్‌లో కాంగ్రెస్ అభ్యర్థి ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నారని డాక్టర్ కె. సంజయ్ ఆరోపించారు. కత్తులు, కటార్లతో ప్రదర్శనలు ఏమిటని ప్రశ్నించారు. ప్రచారానికి వెళ్తున్న బీఆర్ఎస్ కార్యకర్తలను నవీన్ మనుషులు బెదిరిస్తున్నారని, ఎన్నికల కమిషన్, పోలీసుల తీరు మారాలని డిమాండ్ చేశారు. సీఎం గన్ కల్చర్‌ను ప్రోత్సహిస్తుంటే కాంగ్రెస్ అభ్యర్థి కత్తులతో వీరంగం చేయరా? అధికారం ఉంది కదా ఏదీ చేసినా చెల్లుతుందంటే కుదరదని అన్నారు. "సినిమాలో విలన్‌లను చూశాం, ఈ రోజు నామినేషన్ల ఘట్టంలో మళ్లీ వాళ్ళను చూశాం. ట్రాఫిక్‌కు గంటల తరబడి అంతరాయం కలిగినా పోలీసులు పట్టించుకోలేదు," అని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ఎవరూ భయపడాల్సిన అవసరం లేదని, బీఆర్ఎస్ కచ్చితంగా జూబ్లీహిల్స్‌లో గెలుస్తుందని సంజయ్ ధీమా వ్యక్తం చేశారు.



# హైదరాబాద్ ఆర్టీసీ క్రాస్ రోడ్స్ లో బీసీ నాయకులతో కలిసి ఎంపీ వద్దిరాజు ధర్నా

**బలగం టీవీ, హైదరాబాద్**

రాజ్యాధికారంలో న్యాయమైన వాటా కోసం, స్థానిక సంస్థల ఎన్నికలతో పాటు విద్యా, ఉద్యోగ రంగాలలో బీసీలకు 42 శాతం రిజర్వేషన్స్ కు పార్లమెంట్ ద్వారా చట్టబద్ధత కల్పించాలని డిమాండ్ చేస్తూ రాష్ట్ర బంద్ కు పిలుపునిచ్చిన సందర్భంగా బీఆర్ఎస్ పార్లమెంటరీ పార్టీ డిప్యూటీ లీడర్, రాజ్య సభ సభ్యులు వద్దిరాజు రవిచంద్ర ఆర్టీసీ క్రాస్ రోడ్స్ లో పార్టీ నాయకులు,శ్రేణులతో కలిసి ఆందోళన చేపట్టారు.